కల్పిక

# ఊహాగానం

'కమలలత'

సాయంత్రం ఏడు గంటలయింది. అప్పటిదాకా ఆఫీసులో ఎత్తిన తల దించకుండా పనిచేసి అప్పుడే బయలుదేరాడు యింటికి. ఎంత కష్టపడి పనిచేసినా కాగితాలు తరగడంలేదు. రోజురోజుకు పెరుగుతున్నాయిగాని తగ్గే సూచనలే లేవు. ఒక్కొక్కపూట అసలు ఈ పనెందుకు చెయ్యాలి అని బాధపడతాడు. ఈ పని చెయ్యటానికే పుట్టానేమోనని ఆందోళన, భయం ఆవరిస్తుంటాయి. అదేసమయంలో, కాని తప్పదు. చెయ్యీ నోరు కలవడానికదే మార్గం.

ఆశలు, ఆశయాలు ఎన్నో ఉన్నాయి. జీవితంలో అతనికి కథకుణ్ణవుదామని, 'యీ కథ చదివామండి' అని ఎవరయినా చెబుతుంటె ఆనందిద్దామని కోరిక. ఏళ్ళు గడిచిపోతున్నాయి గాని, కోరిక నెరవేరడం లేదు.

ఆఫీసునుంచి బయలుదేరాడన్న మాటే గాని యింటికి వెళ్ళడానికి భయం. యింట్లో కాలు పెట్టగానే వినిపించేవి పిల్లల ఏడుపులు. జీతం పెరగకపోయినా కుటుంబం పెరగడం మానలా మోహన్‌మూర్తికి. అదొక సమస్య. వీళ్ళందరిని ఎలా పెంచడం అని దిగులుపడి పోతుంటాడు వాళ్ళను చూసి.

తనభార్య తనని అర్థం చేసుకోదు. యింటికి రాగానే సణుగుడు మొదలుపెడుతుంది.

ఆ పూట యింట్లో బియ్యం లేవు. పొద్దుట ఆఫీసుకు వెళ్ళేటప్పుడే చెప్పింది బియ్యం పంపించమని. దొరకక కొంత, డబ్బులేక కొంత మోహన్ మూర్తి నిర్లక్ష్యం చేశాడు. పక్కింటమ్మను అప్పడిగి తీసుకుని కాలం వెళ్ళబుచ్చుతుందని తెలుసు. అయినా యింటికి వెళ్ళడానికి భయం వేసింది. మనస్కరించలేదు.

కనీసం ఒకగంట శాంతంగా గడుపుదామని పార్కుకు బయలుదేరాడు. దారిలో హైస్కూలు ఆవరణలో జనం కిటకిటలాడుతున్నారు.

ఏమిటదని ఒకాయన నడిగి తెలుసుకున్నాడు.

ఒక మహాకవికి సన్మానం. ఉత్సాహం కలిగింది. వెళ్ళి ఆ జనంలో ఒకమూల నిల్చున్నాడు.

మహాకవిని పుష్పమాలాంకృతుణ్ణి చేశారు. వేదికమీద పిల్లకవులు, పెద్దకవులు, ఒకరి వెంబడి ఒకరు సన్మానపత్రాలు చదివారు. కొందరు ఆయన చేసిన సాహిత్యసేవను కొనియాడారు. కావ్యాలను మహాకవికి అంకితంచేశారు. వినోదాలేర్పాటుచేశారు. దేదీప్యమానంగా వెలిగిపోతున్నాడు మహాకవి ఆ సమూహంలో

మోహన్ మూర్తికి ఆకలేసింది, యింటికి వెళ్ళడానికిష్టంలేదు. వేరేమార్గం లేదు.

యింటి ముఖం పట్టాడు. దారిలో

ఎదురుగా ఒక హోటలు లైటు కనపడింది. కాంతి విరజిమ్ముతోంది ఆ లైటు. దాన్ని చూస్తూ నడుస్తున్నాడు మోహన్‌మూర్తి.

దృష్టి కేంద్రీకరించడంవల్ల కళ్లు మిరుమిట్లు గొలిపాయి. ఆ జ్యోతి తప్ప అతనికింకేమీ కనుపించడంలేదు. అందులో మహాకవి సన్మానవేదిక చూశాడు. ఈసారి వేదికమీద మహాకవి బదులు తన ప్రతిబింబాన్ని చూశాడు.

ప్రజాసమూహం - కవిగోష్ఠి అన్నీ ఉన్నాయి. మహాకవి సన్మానం కంటె ఎక్కువగా జరుపుతున్నారు.

తనభార్య పిల్లలతో వచ్చింది ఆ సమయంలో. ఒక వాలంటీరు, "తప్పుకోండి, కవిగారి భార్య" అని దారిచేసి ముందుకు తీసుకొస్తున్నాడు. ఆమె తనవైపు మీ ప్రతిభేనని ఒక్కచూపు చూసింది.

తన పిల్లలు ఎంతో ఆనందంగా ఉన్నారు. ప్రజలు తన పిల్లలను చూసి, "ఎంత అదృష్టవంతులయ్యా మీరు ఆ మహాపురుషుడికి జన్మించారు" అన్నట్టు ఈర్ష్యతో చూస్తున్నారు.

తను మాత్రం తొణకకుండా బెణకకుండా నిండుకుండలా కూర్చొని ఉన్నాడు యిదంతా గమనిస్తూ.

యింతలో ఒంపులు వంటబట్టిన ఆవిడ కాలు ఘల్ మనిపించింది. తాళం, మృదంగం అందుకున్నాయి.

"ఎవడికోసం చేస్తారు యివన్నీ" అన్న ధీమాతో కూర్చున్నాడు తను. నృత్యం జోరుగా సాగిపోతున్నది. ఆనందిస్తున్నాడు మోహన్‌మూర్తి ఆ హోటల్ లైటు చూస్తూనే!

లారీ హారన్ మ్రోగింది. మోహన్‌మూర్తికి వినబడలేదు. మళ్ళీ హారన్ మ్రోగింది. మోహన్‌మూర్తి దృష్టి మరలలేదు. పొంయి, పొంయి మని హారన్ మ్రోగించుకుంటూనే లారీ ముందుకొచ్చేసింది. మోహన్‌మూర్తిలో చలనంలేదు. నడుస్తూనే నృత్యానికి ఆనందిస్తున్నాడు చూపు మరల్చకుండా.

లారీకి బ్రేకుపడింది. ఆ శబ్దానికి మోహన్‌మూర్తి తన ఊహాప్రపంచంలోంచి వాస్తవానికొచ్చాడు. కాని ఆలస్యమైపోయింది. తప్పుకుందామని ప్రయత్నించేటప్పటికల్లా లారి మీదకొచ్చేసింది.

'అమ్మా!' అన్న కేకతో నేలకొరిగాడు. జనం మూగారు, హాస్పిటల్‌కు చేర్చారు.

తెల్లవారేటప్పటికల్లా మోహన్‌మూర్తి ఈ లోకాన్ని విడిచి వెళ్ళిపోయాడు.

కడుపు నొప్పి, నోట నీరూరుట, త్రేపులు, వాంతులు, మలబద్ధకము లాంటి అజీర్ణ లక్షణములకు

కేసరిగారి

ఆదిత్యలవణము

దివ్య ఔషధము

వెల రు. 1-75 న.పై.

కేసరి కుటీరం ప్రైవేట్ లిమిటెడ్

మద్రాసు 14.